క్లుప్తంగా

క్రికెటర్ త్రిషకు సన్మానం



త్రిషను సన్మానిస్తున్న సభ్యులు

భద్రాచలంటౌన్: భారత్ తరుపున మహిళ అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్‌లో ఆడి ప్రతిభ చాటిన భద్రాచలం పట్టణానికి చెందిన త్రిషను గాంధీపథకం జిల్లా కన్వీనర్ సర్వేశ్ బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. మాధవి, జ్ఞాన వినోదిని, అనూష, ఎర్రెస్ట్ పాల్గొన్నారు.

పంచాయతీ వేలం ఖరారు

భద్రాచలంటౌన్: భద్రాచలం పంచాయితీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన వేలం పాటల్లో రెండు ఖరారు కాగా మూడు వాయిదా పడ్డాయి. గోదావరి నదిలో ఫెర్రీ పాటను పొడియం వెంకటరమణ రూ.18.75 లక్షలకు, కొత్త మార్కెట్ సంతలో ఆశీలు వసూలుకు పూనెం కృష్ణ రూ.1.76 లక్షలకు దక్కించుకున్నారు. వాయిదా పడిన మరో మూడు పాటలను ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు

అశ్వాపురం: ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయొద్దని జిల్లా సహాయ మలేరియా అధికారి గొంది వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ఆర్‌ఎంపీలతో అశ్వాపురం పీహెచ్‌సీలో బుధవారం ప్రథమ చికిత్సలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రామాల్లో ఆర్‌ఎంపీల పరిధిలో ప్రజలకు స్థాయిని వైద్యం చేయొద్దన్నారు. మలేరియా జిల్లా కన్సల్టెంట్ కృష్ణయ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ లింగ్యా నాయక్, ఎంటీఎస్ కొమరం అరుణ్‌బాబు, హెచ్‌ఏ కిరణ్, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

దుమ్ముగూడెం: హనుమకొండ జిల్లాలో దళిత మహిళ సర్పంచ్‌ను వేధింపులకు గురి చేసిన అధికార పార్టీ ఎమ్మెల్యేపై తక్షణమే చర్యలు తీసుకోవాలని దళిత హిందూ మాలనాడు వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి వెంకటరాజు డిమాండ్ చేశారు. బుధవారం కె.దంతెనం గ్రామంలో ఆ సంఘం సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముత్యాల హనుమంతరావు, బీజేపీ మండలాధ్యక్షుడు తెల్లం శేఖర్, కుర్సం వసంతరావు, కుర్సం నాగమణి పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరం

మణుగూరు రూరల్: మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన పలువురికి నేత్ర వైద్యాధికారి డాక్టర్ జి.సంజీవరావు కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరికి ఖమ్మం ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు నేత్ర వైద్యాధికారి సంజీవరావు తెలిపారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలు రద్దు చేయాలి

బూర్గంపాడు: పరీక్ష పేపర్ల లీకేజీ వ్యవహారం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు రద్దు చేయాలని బీఎస్పీ జిల్లా కార్యదర్శి కేవీ.రమణ అన్నారు. బూర్గంపాడులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన అమరణ దీక్షకు మద్దతుగా మండల కేంద్రాలలో నిరాహార దీక్షలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు గాడిద దామోదర్, సాడే వీరాస్వామి, ఇల్లందుల శేషు, సీతారాములు, కంగాల రమణకుమారి, కామాక్షి పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఎదుట నిరసన

మణుగూరు రూరల్ : టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజ్‌ను నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి జె.గణేష్ మాట్లాడుతూ... టీఎస్‌పీఎస్‌సీ ఏఈ పేపర్, గ్రూప్1 ప్రిలిమినరీ లికేజ్ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వం ఆడుతున్న నాటకమేనన్నారు. పేపర్ లీకేజ్ వ్యవహారంలో సూత్రధారులను వెంటనే అరెస్ట్ చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన సెక్రటరీ బి.జనార్దన్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణయ్‌కుమార్, నాయకులు హారికి, సాయిజ్యోతిక, శిరీష, సమీరా, సాధిక, అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి

మణుగూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచడాన్ని నిరసిస్తూ భద్రాచలంకు చెందిన తూతిక ప్రకాశ్ సారథ్యంలో భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు చేపట్టిన మోటార్ సైకిల్ ప్రజా చైతన్య యాత్ర బుధవారం మణుగూరు చేరుకుంది. ప్రభుత్వం పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని కోరారు. మణుగూరు పట్టణంలోని ఆర్టీసీ కార్మికులను కలిసి గ్యాస్ ధరలపై వివరించారు.

పొంచి ఉన్న ప్రమాదం..

- కరకట్ట పనుల కోసం తవ్వకాలు
- విద్యుత్ స్తంభాల చుట్టూ మట్టి తొలగింపు
- ఎప్పుడు కూలుతాయో తెలియక స్థానికుల ఆందోళన



చుట్టూ మట్టి తీయగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

చర్ల: మండలంలోని దేవరాపల్లి కుదునూరు గ్రామాలలో విద్యుత్‌తో ప్రమాదం పొంచి ఉంది. ఏదైనా జరగరానిది జరిగితే ప్రజలు, పశువుల ప్రాణాలు పోయే ప్రమాదమే కనిపిస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్మాణ పనుల్లో భాగంగా చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో కరకట్టల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జోడీ చీలికల వాగులు, టపావాగులకు కరకట్టలు నిర్మించేందుకు వాగులకు ఇరువైపులా ఉన్న సుమారు వంద ఎకరాల్లోని సాగుభూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టిన కంపెనీకి అప్పగించడంతో కంపెనీ కరకట్టల నిర్మాణ పనులు చేపట్టింది. ఈ భూముల్లో సుమారు 20 నుంచి 25 అడుగుల మేరా లోతుతో మట్టిని తీస్తూ కరకట్టలకు తరలిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కందకాలు ఏర్పడ్డాయి. అయితే ఈ ప్రాంతం మీదుగానే భద్రాచలం నుంచి వెంకటాపురం వైపునకు, చర్ల నుంచి రాళ్లగూడెం వైపునకు వెళ్లే 33 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లు ఉన్నాయి. ఈ లైన్లు ఉన్న స్తంభాలను వదిలి దాని చుట్టూ 20 నుంచి 25 అడుగుల మేరా లోతున మట్టి తీస్తుండడంతో ప్రస్తుతం ఈ విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలిపడతాయో అనే భయం స్థానికుల్లో నెలకొంది. ఈ స్తంభాలు కూలిపడితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం వాటిల్లో ప్రమాదం ఉంటుంది. ఈ ప్రాంతాల మీదుగా వ్యవసాయ పనులకు నిత్యం కూలీలు, రైతులు వెళ్లి వస్తూ ఉంటారు. ఈ విషయం విద్యుత్‌శాఖ అధికారులకు తెలిసినప్పటికీ మిన్నకుండడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఈ విద్యుత్ లైన్ల మార్పు కోసం చర్యలెందుకు చేపట్టడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ ప్రమాదాలతో పాటు ఇక నుంచి అడపాదడపా వచ్చే గాలి దుమారాలు, అకాల వర్షాలకు ఈ విద్యుత్ లైన్లలో ఏమైనా అంతరాయాలు ఏర్పడితే ఈ విద్యుత్ స్తంభాల వద్దకు సిబ్బంది వెళ్లి ఎలా మరమ్మతులు కొనసాగిస్తారే దానిపై సందిగ్ధం నెలకొంది. ప్రమాదాలు చోటు చేసుకోకముందు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగక ముందే విద్యుత్ శాఖాకారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న సింగరేణి అధికారుల బృందం

మణుగూరుటౌన్: సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్నామని ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్ అన్నారు. బుధవారం మణుగూరు ఏరియాలోని సింగరేణి సీఎస్ఆర్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి సామాజిక బాధ్యతలో భాగంగా పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు రేగా కాంతారావు ప్రతిపాదనల మేరకు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ ఆదేశాలతో ఈ నిధులు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. ప్రభావిత ప్రాంతాలు గ్రామాల అభివృద్ధికి సింగరేణి పెద్ద ఎత్తున కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, ఫైనాన్స్ మేనేజర్ అనురాధ, సీనియర్ ఎస్టేట్ అధికారి బాబుల్‌రాజ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రీనాల్డ్ సివిల్ సూపర్ వైజర్ శ్రావణ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం జయంతి..

దుమ్ముగూడెం: బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతి వేడుకలను బుధవారం మండలంలోని నర్సాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ నర్సాపురం సెక్టార్ అధ్యక్షుడు కనుకు సాగర్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సమూహమైన బహుజన సమాజానికి రాజ్యాధికారం సాధించిన మహనీయుడని కొనియాడారు. జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పాడుతూరి రవీంద్ర ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు సింహాద్రి, ప్రధాన కార్యదర్శి నారాయణ, జానకి రావు, ముకేష్ పాల్గొన్నారు.

చర్ల: బీఎస్పీ మండలాధ్యక్షుడు కూరపాటి వీర్రాజు ఆధ్వర్యంలో మండలంలోని ఆర్ కొత్తగూడెంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్, జిల్లా కార్యదర్శి ఈసంపల్లి నర్సింహారావు, సీనియర్ నాయకులు పూనెం ముఖేష్, మండల మహిళా కన్వీనర్ సోని తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

దుమ్ముగూడెం: సైబర్ నేరాలపై యువకులకు ఎస్సై రవికుమార్ బుధవారం అవగాహన కల్పించారు. ములకపాడు క్రీడామైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీల దగ్గరకు చేరుకున్న యువతకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు ఫోన్‌లకు వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని అకౌంట్ నుండి నగదు మీకు తెలియకుండా డ్రా అయినట్టు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ కృష్ణారావు,శంకర్ పాల్గొన్నారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి



అశ్వారావుపేటరూరల్: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రోజారాణి

అశ్వారావుపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న విలువైన పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక సీడీపీఓ రోజా రాణి కోరారు. మండల పరిధిలోని దురదపాడు గ్రామంలో బుధవారం పోషకాహారంపై ఇంటింటికీ వెళ్లి ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పోషకాలతో కూడిన ఆహారాన్ని తీసుకోడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సౌజన్య, ఏఎన్‌ఎం రామలక్ష్మీ, భూలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ సరోజిని పాల్గొన్నారు.

చంద్రుగొండ: పౌష్టికాహారం తీసుకుంటేనే పిల్లలు తల్లులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ నిర్మలాజ్యోతి అన్నారు. మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో బుధవారం గర్భిణులు, చిన్నపిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై హర్షం



ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును సత్కరిస్తున్న నాయకులు

ములకలపల్లి: తాళ్లపాయ శివారులో పాములేరు వాగు ప్రవాహ ఉధృతికి దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరికి కృషి చేసిన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును బుధవారం తాటిసుబ్బన్నగూడెంలోని ఆయన స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. ఉపసర్పంచ్ రవ్వా జయరామ్, పెనుబల్లి ప్రసాద్, సూరం పుల్లారావు, కొండ్రు బాబూరావు, సూర్యనారాయణ, శ్రావణ్, మడకం నాగేశ్వరరావు, రాము, మిడియం బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

సింగరేణి ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్

మణుగూరుటౌన్: సింగరేణి ఉద్యోగంతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. బుధవారం మణుగూరు ఏరియాలోని మెడికల్ ఇన్‌వాలిడిటీ అయిన నలుగురు ఉద్యోగుల కుటుంబాలకు చెందిన డిపెండెంట్స్‌కు ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణి ఉద్యోగి ప్రత్యక్షంగా సంస్థ అభివృద్ధికి తన కుటుంబ అభివృద్ధికి పాటుపడితే పరోక్షంగా దేశ రాష్ట్ర ప్రగతికి దోహదపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, డీజీఎం పర్సనల్ రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి రామేశ్వరరావు, టీబీజీకెఎస్ యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు, నాయకులు అబ్దుల్ రవూఫ్, సీనియర్ అసిస్టెంట్ ఏ ఠాకూర్‌లు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



దుమ్ముగూడెం: పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధ్యాపకులు

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు బుధవారం నుండి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు గంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలను పలువురు అధికారులు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద సిట్టింగ్ స్క్వాడ్లు ఉన్నారు. ఆరోగ్య, వైద్య సిబ్బంది అనారోగ్యంతో ఉన్న విద్యార్థులకు సేవలు అందించారు.

– సాక్షి నెట్‌వర్క్



గుండాల: పరీక్షా కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



బూర్గంపాడు: పరీక్షా కేంద్రం వద్ద డీఎస్పీ వెంకటేష్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ



పినపాకలో..



భద్రాచలంటౌన్: పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రత్న కళ్యాణి



మణుగూరుటౌన్: తమ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



చర్ల: పరీక్షా కేంద్రాన్ని సందర్శిస్తున్న తహసీల్దార్ భరణిబాబు

జనచైతన్యయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బాబురావు

దుమ్ముగూడెం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం చేపట్టిన జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ నిత్యవసర సరుకులు ధరలను తగ్గించాలని అదే విధంగా రైతులు పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17న హనుమకొండలో ప్రారంభమయ్యే జన చైతన్య యాత్ర ఈ నెల 20న మండలంలో పర్ణశాల మునలమడుగు గ్రామంకు చేరుకుంటుందని లక్ష్మీనగరం సెంటర్లో ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట వేలాది మందితో బహిరంగ సభ జరుగుతుందని ఈ సభకు వేలాదిగా కదిలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీ, మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కార్యదర్శి కారం పుల్లయ్య, మర్మం చంద్రయ్య, బొల్లి సత్యనారాయణ, గుడ్ల రామ్మోహన్ రెడ్డి, కె. సాంబశివరావు, తోడం తిరుపతిరావు, అపక రంగయ్య, మడకం మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చర్ల: హనుమకొండలో ప్రారంభమైన సీపీఎం పార్టీ జన చైతన్య యాత్ర ఈ నెల 19న చర్ల మండలానికి చేరుకుంటుందని, ఈ యాత్రకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకులు, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మండలంలోని కుర్నపల్లి, ఎర్రబోరు, బోదనెల్లి గ్రామాలలో పర్యటించి ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి కారం నరేష్, మండల కమిటీ సభ్యుడు ముదిండి రామరాజు, నాగేశ్వరరావు, సత్యం పాల్గొన్నారు.

ఆర్టీసీ 'లాజిస్టిక్' పాయింట్ ప్రారంభం



కార్గో పాయింట్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

కరకగూడెం: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో రెండున్నరేళ్లుగా కార్గో పార్సిల్ సేవలు అద్భుతంగా కొనసాగుతున్నాయని ఆర్టీసీ ఖమ్మం ఆర్ఎం‌ఈ హరివర్మ, కరకగూడెం సర్పంచ్ ఊకే రామనాథం అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) సర్వీసు పాయింట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... . ఈ పాయింట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకుని, ఆర్టీసీ అభివృద్ధికి ప్రజలు దోహదపడాలని కోరారు. అనంతరం ఆర్టీసీ అందజేస్తున్న సేవలను తెలియజేస్తు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ బి.సైదులు, భద్రాచలం డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవి కుమార్, కొత్తగూడెం డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ హనుమ, సత్తుపల్లి డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మున్నీరుపాషా, కరకగూడెం కార్గో పాయింట్ ఏజెంట్ బుగ్గల లక్ష్మణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాగుతున్న జాతర



అమ్మవార్లను తీసుకొస్తున్న పూజారులు

చర్ల: మండలంలోని ఆర్ కొత్తగూడెం గ్రామపంచాయతీలో గల దానవాయిపేటలో సమ్మక్క సారలమ్మ జాతర వైభవంగా సాగుతోంది. రెండో రోజు జాతరలో భాగంగా బుధవారం చింతగుప్ప సమీపంలో గల చింతవాగు వద్ద నుంచి వనదేవతలను మేళతాళాల నడుమ దేవరబాలలు, పూజారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామపెద్దల జయ జయ ధ్వానాల నడుమ దానవాయిపేటలోని గద్దెల వద్దకు చేర్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కులు సమర్పించారు. నేడు అమ్మవార్లకు గంగాస్నానం అనంతరం భారీగా తరలివచ్చి భక్తులు దర్శించుకోనున్నారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యావతి, బీజేపీ నాయకులు, బీజేపీ పాయకులు దర్శించుకున్నారు. పూజారులు మడకం జోగయ్య, పాయం కన్నయ్య, మడివి రాముడు, దేవర బాలలు కారం మహి, సోయం శివమ్మ, పాయం ప్రియ నేతృత్వంలో ఈ జాతర మహోత్సవం కొనసాగుతుండగా, కమిటీ సభ్యులు నూపా రమేష్, కారం సుధాకర్, సోయం నర్సింహారావు, సోయం శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఆంక్షలు అప్రజాస్వామికం



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

భద్రాచలం: రాష్ట్ర ప్రభుత్వం మీడియాపై ఆంక్షలు విధించటం అప్రజాస్వామికమని జర్నలిస్టులు పేర్కొన్నారు. వీ6 చానల్, వెలుగు పేపర్‌పై బీఆర్ఎస్ పార్టీ ఆంక్షలు విధించడాన్ని నిరసిస్తూ జర్నలిస్టు జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నల్లబ్యాడ్జీలను ధరించి ర్యాలీ చేపట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతిపత్రం అందచేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ పార్టీగా అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన ఈ చర్య సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బీవీ రమణారెడ్డి, చారుగుళ్ల రమేష్, తోకల నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జి.వెంకటేశ్వర్లు, రవికుమార్, పిల్లి రాజు, దిలీప్ కుమార్, కృష్ణ, కిరణ్, లక్ష్మీకాంత్, జయరాం, విజయ్, క్రాంతికుమార్, భూక్యా రంజిత్, రాజాకిరణ్, వెంకటేశ్వరరావు, సాయి కౌశిక్, సుధీర్, నవీన్, సంపత్, హన్మంతు, నాయకులు సునీల్ కుమార్, తిరుమలరావులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

గుండాల: నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఎంపీపీ ముక్తి సత్యం అన్నారు. మండలంలోని రూ. 20లక్షల వ్యయంతో పడుగోనిగూడెం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మండలంలో అన్ని పంచాయతీలకు కార్యాలయాలకు నిధులు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ, పంచాయతీ రాజ్ శాఖల కింద నిధులు వచ్చేలా అధికారులు కృషి చేయాలన్నారు. సర్పంచ్ జయసుధ, పీఆర్ఏఈ అఖిల్, కార్యదర్శులు అఖిల్, రమేష్, కారోబార్ రామనాథం పాల్గొన్నారు.

ప్రదర్శనను జయప్రదం చేయండి

మణుగూరు రూరల్: గోదావరి వరద ముంపు బాధితులకు ఇళ్లు లేని నిరుపేద ఆదివాసీ దళితులకు గృహ వసతి కల్పించాలని నేడు నిర్వహించనున్న ప్రదర్శనను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల మహిళా సంఘం, గోదావరి వరద బాధితుల పోరాట కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రదర్శన అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిలక్ష్మీ, భారత రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఊక్ల, పోరాట నాయకులు ప్రశాంత్, భూలక్ష్మీలు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా కల్వర్టులు



మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి పలు చోట్ల కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. స్థానికులు కాలినడకన తిరుగుతుంటారు. ఈ నేపథ్యంలో కల్వర్టులు రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేవు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి : రాంబాబు, ఆర్అండ్‌బీ ఏఈ, అశ్వాపురం
సెల్ నంబర్ :9441435367